క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

15న నిరసన కార్యక్రమం



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

నంద్యాల(న్యూటౌన్): ఏపీకి ఇచ్చిన హామీలను విస్మరించినందుకు పీఎం మోదీ గో బ్యాక్ అంటూ ఆర్‌ఎస్‌పీ రేవులేషన్ సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో 15వ తేదీన నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయ నిర్మాణానికి, అమరావతి నిర్మాణానికి నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని, కడపలో ఉక్కు కర్మాగారం నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సుబ్బయ్య, అబ్రహాం, శివ, రవి, మనోహర్, అమర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. ప్రత్యేక హోదాపై ప్రశ్నించవెందుకు?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపుపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని సీఎం చంద్రబాబునాయుడును సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు ప్రశ్నించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధుల కేటాయింపుపై ఒకలా మాట్లాడి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీపై పల్లెత్తు మాట కూడా అనడం లేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం నోరుమెదపటం లేదన్నారు. రాష్ట్రాభివృద్ధిని ఏమాత్రం సాయం చేయని పీఎం నరేంద్రమోదీ రాష్ట్రంలో పర్యటించటం సమంజసం కాదన్నారు. అందుకే పీఎం పర్యటనను అడ్డుకుంటామన్నారు.

పేదలకు అండగా ఉంటాం

మహానంది: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు జనసేన సహాయ సహకారాలు అందిస్తుందని జనసేన జిల్లా నాయకులు భవనాశి వాసు, సుధాకర్ అన్నారు. మహానంది మండల జనసైనికుల ఆధ్వర్యంలో మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంలో సుమారు రూ. 40 వేలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును ఆదివారం వారు ప్రారంభించారు.

అడ్వకేట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

నందికొట్కూరు: సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేష్ కిశోర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాలమహానాడు నాయకులు వెంకటేశ్వర్లు, మధు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ అడ్వకేట్ సభ్యత్వం రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి మరవకముందే హర్యాణ రాష్ట్రంలో దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మరణం బాధాకరమన్నారు. కుల వివక్ష వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు శ్రీను, నాగేంద్ర, ధర్మరాజు, భక్షాలు, రవి, ఏసురత్నం, ప్రకాష్‌రావు, విజయరాజు, నత్తానాయేలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై గ్రామసభ

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో ఆదివారం రాత్రి సీఐ రాము గ్రామ సభ నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



బీటలు వారిన ఉయ్యాలవాడ తహసీల్దార్ ఆఫీసు



పశు వైద్యశాల గదుల్లో దెబ్బతిన్న బండ పరుపు



ఉయ్యాలవాడలో బీటలు వారిన పశు వైద్యశాల భవనం



రెవెన్యూ కార్యాలయంలో ఊడిపోయిన పై కప్పు

పదేళ్లకే పాడుబడ్డాయి!

- 2014-15లో రూ. 67 లక్షలతో పశు వైద్యశాల, తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం
- నాడు పనుల్లో నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలివ్వడంతో శిథిలావస్థకు చేరిన వైనం

ఏదైనా భవనం నిర్మిస్తే కనీసం 20 ఏళ్లు అయినా భద్రంగా ఉంటుంది. అయితే, ఇక్కడ కనిపిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు పట్టుమని పదేళ్లు కూడా పూర్తికాక ముందే బీటలు వారి శిథిలావస్థకు చేరాయి. నిర్మాణ సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడమే దీనికి ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2014-15 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో రూ.24 లక్షలు వెచ్చించి పశు వైద్యశాల, రూ. 40 లక్షలు వెచ్చించి తహసీల్దార్ కార్యాలయం భవన సముదాయాలు నిర్మించారు. ఇప్పుడు ఈ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి పైకప్పులు కారుతున్నాయి. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. గదుల్లో ఏర్పాటు చేసిన బండ పరుపు (టైల్స్) ముక్కలుగా పగిలిపోయాయి. దశాబ్ద కాలానికే పశువైద్య శాల, రెవెన్యూ కార్యాలయం ఈ స్థితిలోకి రావడం నాడు పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతను విస్మరించడం, పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడమేనని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు లేదా నూతనంగా నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ఇలాగే వదిలేస్తే వర్షానికి గదుల్లో ఉన్న ముఖ్యమైన రికార్డులు, మందులు తడిసిపోయే ప్రమాదం ఉంది.

–ఉయ్యాలవాడ

రేపు హుండీ కానుకల లెక్కింపు

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలంతో పాటు పట్టణంలోని బైటిపేటలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, ఇందులో పాల్గొనే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సింగరాజు పల్లెకు బస్సు సౌకర్యం

కొత్తపల్లి: మండలంలోని సింగరాజు పల్లి గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సుకు మామిడి తోరణాలు, పూలమాలలు వేసి పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం హారతులిచ్చి హర్షం వ్యక్తం చేశారు. గతంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో అర కిలోమీటర్ నడిచి బస్టాండ్ వద్ద బస్సుల కోసం వేచి ఉండేవాళ్లమని గ్రామస్తులు ప్రసాద్, ఆంజనేయులు, కృష్ణయ్య, సంజీవరెడ్డి, రాము, వెంకటేశ్వర్లు అన్నారు. ప్రస్తుతం బస్సు గ్రామంలోకి రావడంతో ఆత్మకూరు వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. బస్సును సింగరాజు పల్లి గ్రామంలోకి వేసినందుకు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

'అంజుమన్' సేవా కార్యక్రమాలు విస్తరిస్తాం





సామూహిక వివాహాల్లో పాల్గొన్న అంజుమన్ సంస్థ సభ్యులు

నంద్యాల(అర్బన్): అంజుమన్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని సంస్థ అధ్యక్షుడు ఎస్ఎండీ కుద్దూస్ తెలిపారు. నిరుపేద ముస్లిం యువతీ యువకులకు సామూహిక వివాహాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రంజాన్ మాసంలో మసీదులకు జానీ మాజ్‌లను పంపిణీ తదితర కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. స్థానిక అంజుమన్ షాదీఖానాలో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో 7 గురు నిరుపేద ముస్లిం యువతీ యువకులకు సామూహిక వివాహాలు జరిపించడంతో పాటు యువతి తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కుద్దూస్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఎంత మంది నిరుపేద ముస్లిం వధూవరులు వచ్చినా వివాహాలు జరిపించి రూ.50 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. సంస్థ చేస్తున్న సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్‌హక్, ఇదాయతుల్లా, షేక్ మహమ్మద్‌గౌస్, షేక్ మున్నా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కృతజ్ఞతార్పణల పండుగ

నంద్యాల(న్యూటౌన్): దశమ భాగం దేవునికి చెల్లిస్తే దేవుడు మెండైన దీవెనలు కుటుంబాలకు ప్రసాదిస్తాడని నంద్యాల డయాసిస్ ట్రెజరర్, పరిశుద్ధ మత్తయి ఆలయం పాస్టరేట్-3 డీనరీ చైర్మన్ రెవరెండ్ నందం ఐజక్ గురువులు అన్నారు. ఆదివారం పాస్టరేట్-3 (పరిశుద్ధ మత్తయి ఆలయం)లో కృతజ్ఞతార్పణల పండుగ, కోత పండుగ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఏడాదికి ఒక సారి ఈ అర్పణాల పండుగను జరుపుకుంటామని, క్రీస్తు ద్వారా పొందిన మేలును దశమ భాగంలో క్రైస్తవులు ధనం, ధాన్యం ఇస్తారని తెలిపారు. పాస్టరేట్-3 ఆలయ పరిధిలో ఉన్న చిన్న పిల్లలతో మొదలుకొని పెద్దల వరకు కుటుంబాలుగా పాల్గొని గురువులతో దైవదీవెనలు పొందారు. క్రైస్తవులు క్రీస్తు అడుగు జాడల్లో నడవాలని మత పెద్దలు సూచించారు. కార్యక్రమంలో పాస్టరేట్-3 సెక్రటరీ సంజీవకుమార్, ట్రెజరర్ సెల్వరాజ్, గురువులు రవీంద్ర, రవికుమార్, సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకతే సమాచార హక్కు చట్టం ఉద్దేశం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబు దారి తనం పెరగాలన్నదే సమాచార హక్కు చట్టం ఉద్దేశమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల పట్ల ప్రజలు పూర్తి స్థాయి అవగాహన కలిగిఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక చేస్తున్న కృషిని పలువురు అభినందిస్తున్నారన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మస్తాన్‌వలి, కార్యదర్శి సత్యనారాయణ, రహమతుల్లా, శివరామిరెడ్డి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

గో ఆధారిత వ్యవసాయంతో పర్యావరణ సమతుల్యత



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): గో ఆధారిత వ్యవసాయం భూసారం పెంపుతో పాటు పర్యావరణ సమతుల్యత కాపాడుతుందని, రైతులు ఈ విధానాన్ని అనుసరించి స్వచ్ఛమైన ఆహార ఉత్పత్తులు తయారు చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. స్థానిక టెక్కె మార్కెట్ యార్డులో ఆదివారం కామదేను సిరి సంపద-నవనందుల నంద్యాల చెంత గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సంత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయమే ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దారి తీస్తోందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేని ఆహారం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ హరిబాబు, వైస్ చైర్మన్ రంగప్రసాద్, విజయరాం, పబ్బతి వేణు, శ్రీనివాసులు యాదవ్, అబ్దుల్‌సలాం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సేవకులకు ఆత్మీయ సన్మానం

నంద్యాల(వ్యవసాయం): అమరయోగ వికాస కేంద్రంలో ఆదివారం మన ఊరు-మనగుడి, మన బాధ్యత స్వచ్ఛ సేవకులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కార్తిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుంటూరు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు-మనగుడి, మన బాధ్యత సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డు అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది సభ్యులు కలిగిన తమ సంస్థ 300కు పైగా గుడులు, కోనేర్లు, బావులను శుభ్రం చేసిందన్నారు అనంతరం శివకుమార్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్వచ్ఛ సేవకులకు పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో రఘువీర్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, శేఖరప్ప, రాంప్రసాద్, బాబురావు, ఎస్.వెంకటేశ్వర్లు, తదితర సేవకులు పాల్గొన్నారు.



డబ్ల్యూ కొత్తపల్లె నుంచి యాళ్లూరు వెళ్లే దారి

సారూ..ఇటు చూడండి!

- ఆధ్వానంగా గ్రామీణ రహదారులు



దొర్నిపాడు నుంచి ఉయ్యాలవాడ దారి ఇలా

దొర్నిపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ఆధ్వానంగా తయారయ్యాయి. దారివెంట గోతులే ఉండటంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీంతో గుంతల నిండా వర్షపు నీరు ఉండటంతో వాహదారుల కష్టాలు అనేకం. దొర్నిపాడు నుంచి ఉయ్యాలవాడ, డబ్ల్యూ కొత్తపల్లె నుంచి యాళ్లూరు వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈదారుల్లో ప్రయాణికులతో పాటు రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా గ్రామీణ రహదారులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నికల ముందు మాత్రం అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా మారుస్తామని గొప్పలు చెప్పారని మండల ప్రజలు మండిపడుతున్నారు.

బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్న మోదీ

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు: డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో ప్రభుత్వ భూములను, పేదల భూములను ప్రధాని మోదీ బహుళజాతి కంపెనీలకు దోచిపెడుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని ఆరోపించారు. ఆదివారం ఎంఎంకే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఏపీ రైతు సంఘం జిల్లా మహాసభలో కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. 2014లో బీజేపీ ఇచ్చిన వాగ్దానాలు ఆకర్షించాయని, అధికారంలోకి వచ్చాక వాటిని చేయడంలో ప్రధాని నరేంద్రమోదీ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత మరో మాట చెప్పి రైతులను నట్టేట ముంచిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల గంటకు ఒక రైతు చొప్పన ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. దాదాపు రూ.4500 కోట్ల ఆస్తులను రూ.450 కోట్లకే అంబానీ కుటుంబాలకు కట్టబెట్టేందుకు మోదీ యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ నాగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తర్తూరు గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీతో పాటు అనేక కార్మిక సంఘాలు పోరాటాలు చేసి భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును సాధించుకున్నట్లు చెప్పారు. బోర్డును పునరుద్ధరించటంతో పాటు నిధులు కేటాయించి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు లాలూబాషా, మౌలాలి, వహాబ్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు

ఆత్మకూరు: వ్యవసాయ కార్మికుల వేతనాలను పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సుదర్శన భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఎం.నాగేశ్వరరావు మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు ఐదు సెంట్ల స్థలమిచ్చి రూ.5 లక్షలతో పక్కా గృహాలు నిర్మించాలన్నారు. ప్రజా పంపిణీ ద్వారా కేరళ రాష్ట్రంలో తరహా 15 రకాల నిత్యావసర సరుకులను అందించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలయ్య, డేవిడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఫకీర్ సాహెబ్, జిల్లా నాయకులు టీఓ బ్లెస్, ఎం.కర్ణ, ఎస్.ఆర్.రమణ, సుబ్బరాయుడు, రత్నమయ్య, కులాయిస్వామి, సంజీవ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ కృష్ణారెడ్డి, రామపక్కీర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో కరువు భత్యం చెల్లిస్తున్నా కూటమి సర్కారు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం 15 నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక రీతి, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మరో రీతిలో చూసే డబుల్ ఇంజన్ సర్కార్ ధోరణి మారాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక పర అంశాలన్నింటినీ మెడికల్ బిల్స్, సరెండర్ లీవ్, గ్రాట్యుటీ తర్వగా చెల్లించాలని, లేని పక్షంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ధనుంజయ, చాంద్ బాషా, భాస్కరరెడ్డి, నాయకులు రవిప్రకాష్, సుమన్, మాధవరెడ్డి, కేవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని జీఆర్‌ఎస్ సెంటర్

జూపాడుబంగ్లా: జెండర్ రీసర్చ్ సెంటర్ ప్రారంభానికి నోచుకోవడంలేదు. మహిళల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం జీఆర్‌ఎస్ సెంటర్ ఏర్పాటు నిమిత్తం రూ.5లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరై నెలరోజులు గడిచినా ఇప్పటిదాకా కార్యాలయం ప్రారంభించకపోవటం గమనార్హం. కార్యాలయం ప్రారంభించకపోవటం వల్ల గృహహింస, అదనపుకట్నం, అఘాయిత్యాలకు, అత్యాచారాలకు గురైన మహిళలు వారి సమస్యలను మహిళా పోలీసులు(జీఎంఎస్‌కే), సీఆర్పీలకు తెలియజేసుకునేందుకు సరైన కార్యాలయం, వసతుల్లేకపోవటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్రిస్వామి తెలిపారు. ఆదివారం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధి కల్పన కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సంక్షేమ హాస్టళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్కు, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ బిల్లులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శివతేజ, ఖలీల్ పాల్గొన్నారు.

47 ఏళ్ల తర్వాత

- పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

ఆళ్లగడ్డ: ఒకటి కాదు. రెండు కాదు ఏకంగా నలుబై ఏడేళ్ల స్నేహం వారిది. తమ పిల్లలు పిల్లలకు పెళ్లిలై మనుమండ్లు, మనువరాళ్లు సైతం పెళ్లీడుకు వచ్చారు. అయినా వారే పిల్లలుగా మారారు. బాల్యం నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు ఆడిపాడిన పాఠశాల తరగతి గదులను మరోసారి చూసి తన్మయత్వం పొందారు. నాటి చిలిపి చేష్టలు, అల్లరి పనులను నెమరు వేసుకున్నారు. జ్ఞాపకాల దొంతరులు తెరచి, కబుర్లు చలోక్తులు, ముచ్చట్లలో మునిగారు. స్నేహితులతో పరాచకాలాడి.. అలనాటి నిక్‌నేమ్‌లతో పిలుచుకుని ఆనందాలు పంచుకున్నారు. స్థానిక నమో నారాయణ తపో వనములో 1977 – 78 లో వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం నిర్వహించారు. నాలుగున్నర దశాబ్దాల కిందటి అనుభూతుల్ని పంచుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన ఎద్దుల విక్రమదేవరెడ్డి, శ్రీనాథ్, రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు నాటి విద్యాబోధన, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాలను గుర్తుచేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పొదుపు మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఆర్పీలు

జూపాడుబంగ్లా: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని డీఆర్‌డీఏ జెండర్ సోషల్ యాక్షన్ కమిటీ సీఆర్పీలు నౌషద్, శిరీష తెలిపారు. ఆదివారం పారుమంచాల గ్రామంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ పురుషులు మహిళలను అదనపుకట్నం కోసం వేధించటం, గృహహింస, అఘాయిత్యాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు అబ్బాయిలతో సమానంగా ఆడపిల్లలను చదివించటంతో పాటు విద్యా, ఉద్యోగరంగాల్లో రాణించేలా చేయాలన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను కుటుంబ సభ్యులకు తెలియజేయటంతో పాటు పోలీసులను ఆశ్రయించి న్యాయం కోసం పోరాడాలని సూచించారు. లింగవివక్షత పాటించబోమని పొదుపు మహిళలతో సీఆర్పీలు ప్రతిజ్ఞ చేయించారు.